క్లుప్తంగా

ఉయ్యాల సేవలో కల్యాణ వెంకన్న



ఉయ్యాల సేవలో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఉభయ నాంచారుల సమేతుడైన వెంకన్న ఉయ్యాల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తిరుచ్చి వాహనం అధిరోహించి ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగారు. అంతకుముందు ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజాది కార్యక్రమాలను పూర్తి చేశారు. రాత్రి 9 గంటలకు ఏకాంతసేవను నిర్వహించారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

రేణిగుంట: రాస్ వ్యవస్థాపక కార్యదర్శి మునిరత్నం వర్ధంతి పురస్కరించుకుని శనివారం మండలంలోని కరకంబాడి హైస్కూల్ ఆవరణలో రాస్ మహిళాజ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు పాల్గొని రక్తదానం చేశారు. జిల్లాలో గుత్తా మునిరత్నం చేసిన సేవలను స్మరించారు. కార్యక్రమంలో రుయా బ్లడ్‌బ్యాంకు సిబ్బంది, రాస్ బాలాజి బాలవికాస్ ప్రాజెక్టు ఆఫీసర్ జయచంద్రనాయుడు పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్య పరీక్షలు



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రేణిగుంట: శ్రీకాళహస్తిలోని రాస్ మహిళా కేంద్రంలో శనివారం రాస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ డాక్టర్ గుత్తా మునిరత్నం వర్ధంతి పురస్కరించుకుని రాస్ పొదుపు సంఘాల మహిళలు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా టాటా ట్రస్ట్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రాస్ పొదుపు సంఘాల సంచాలకులు ఉన్నం నాగరాజు, టాటా ట్రస్ట్ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, క్లస్టర్ లీడర్లు, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం

రేణిగుంట: రేణిగుంట డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన భవ్యకిషోర్‌ను శనివారం ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియస్‌రాజు, ముఖ్య సలహాదారు అమ్ములురాజు కలసి ఆమెను శాలువాతో సత్కరించారు. రేణిగుంటలో శాంతి, భద్రతలను నెలకొల్పేందుకు కృషి చేయాలని వారు ఆమెను కోరారు.


అన్నమయ్య జయంతి ఉత్సవాలు ప్రారంభం



సంకీర్తనల గోష్ఠిగానం నిర్వహిస్తున్న అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో శనివారం తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అన్నమాచార్య ప్రాజెక్టు, స్థానిక కళాకారుల సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం ఆకట్టుకుంది. అనంతరం అన్నమయ్య విగ్రహానికి హారతి, మహానివేదన సమర్పించారు. సాయంత్రం తిరుపతికి చెందిన రఘునాథ్, సర్వేశ్వరి బృందం ప్రదర్శించిన సంగీత కచేరి శ్రవనానందకరంగా సాగింది. రాత్రి 7 గంటలకు మదనపల్లికి చెందిన శారద బృందం హరికథాగానంతో భక్తులను ఆకట్టుకున్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

శిఖర కలశానికి బంగారు తొడుగు సమర్పణ



తిరుపతి కల్చరల్: తిరుపతి గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహా కుంభాభిషేకం నేపథ్యంలో అమ్మవారి గర్భాలయ శిఖర కలశానికి బంగారు తొడుగును శనివారం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అందించారు. సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు మాట్లాడుతూ 140 గ్రాముల బంగారంతో కలశానికి తాపడం చేయించామని, అమ్మవారి ఆశీస్సులతోనే మహద్భాగ్యం దక్కిందని తెలిపారు. అలాగే తమ వంతుగా మహా కుంభాభిషేక పూజలకు అవసరమైన సుమారు రూ.50 వేల విలువైన దీక్ష వస్త్రాలు అందజేసినట్లు చెప్పారు.

పథకాలతో రూ.1.56లక్షల లబ్ధి పొందాం సార్!

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యేతో టీడీపీ నేత కుటుంబం వెల్లడి



టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ సతీమణి పార్వతితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ శ్రీకాళహస్తి మండలంలోని టీఎంవీకండ్రిక్కు చెందిన స్థానిక టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ భార్య పార్వతి. శనివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వర్షం కురుస్తున్నప్పటికీ పట్టించుకోకుండా టీఎంవీకండ్రిగ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 300 కుటుంబాలను పలకరించారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకుని ఇంటి వద్దకు వెళ్లగానే పార్వతి వెలుపలికి వచ్చారు. ఎమ్మెల్యే బుక్‌లెట్ తీసుకుని 'అమ్మా! మీకు వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.36,500, జగనన్న వసతి దీవెన కింద రూ.11,000, వైఎస్సార్ సున్నా(డ్వాక్రా) వడ్డీ కింద రూ.2,313, వైఎస్సార్ ఆసరా కింద రూ.16,886, జగనన్న విద్యా దీవెన కింద రూ.89,840, మొత్తం కలిపి రూ.1,56,539 అందాయా?' అని ప్రశ్నించారు. 'మీరు చెప్పిన మొత్తం మాకు అందింది సార్' అని ఆమె నవ్వుతూ బదులిచ్చింది.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

శ్రీకాళహస్తికి కూతవేటు దూరంలో ఉన్న తమ గ్రామంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని సీసీరోడ్లు వేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అలాగే తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామని, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో మురుగు కాలువలు నిర్మించాలని నివేదించారు. చిన్నపాటి వర్షం కురిసినా, గాలులు వీచినా విద్యుత్ అంతరాయం కలుగుతోందని చెప్పారు. ఇంటి పట్టాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సచివాలయ నిధులు రూ.20 లక్షలతో పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ సీపీ సీనియర్ నాయకుడు, ఉత్తమరైతు అవార్డు గ్రహీత రెడ్డివారి బత్తిరెడ్డి, ఏపీబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగాల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, రెడ్డివారి గురవారెడ్డి, మునిరామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మాధవరెడ్డి, మోహన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఎల్.బాలాజి, బాబు, చలపతిరెడ్డి, జగదీష్, సుబ్బు, శీను, వెంకటరెడ్డి, త్యాగరాజ్‌రెడ్డి, కులపురెడ్డి, నాదమునిరెడ్డి, చిరంజీవిరెడ్డి, శ్రీనివాసులు, ప్రసాద్, బాలముని, గోపాల్, వేలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి



నియామక పత్రాలను ఇస్తున్న సీడీపీఓ దేవకుమారి

సత్యవేడు: సత్యవేడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోకి నూతనంగా చేరిన బుచ్చినాయుడు కండ్రిగ మండల అంగన్‌వాడీ కార్యకర్తలు ఆ కేంద్రాల పరిధిలో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి రికార్డులు సక్రమంగా నిర్వర్తించాలని సీడీపీఓ దేవకుమారి కోరారు. మహిళా–శిశు సంక్షేమశాఖను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఇందులో భాగంగా సత్యవేడు ఐసీడీఎస్ పరిధిలోని నాగలాపురం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు పిచ్చాటూరు మండలం ఐసీడీఎస్ కేంద్రంలో చేర్చారు. తొట్టంబేడు ప్రాజెక్టు పరిధిలోని బుచ్చినాయుడుకండ్రిగ మండల అంగన్‌వాడీ కేంద్రాలను సత్యవేడు ఐసీడీఎస్ పరిధిలో కలిపారు. ఈ నేపథ్యంలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సీడీపీఓ మాట్లాడారు . ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టిహారాన్ని బాలింతలు, గర్భవతులకు సక్రమంగా అందేలా చూడాలన్నారు. అంతకుముందు బుచ్చినాయుడు కండ్రిగకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామకపత్రాలను సీడీపీఓ అందజేశారు.

గ్రామాల్లో టైలరింగ్ శిక్షణ



శిక్షణ ప్రారంభిస్తున్న రాజశేఖర్ నాయుడు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం, చెన్నంపల్లె గ్రామాల్లో రాస్ జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో శనివారం టైలరింగ్ శిక్షణ ప్రారంభించారు. ఈ శిక్షణ 30 రోజులపాటు మహిళలకు ఇస్తారు. శిక్షణానంతరం సర్టిఫికెట్స్‌తో పాటు కుట్టు మెషీన్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, రాస్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రాజశేఖర్ నాయుడు, రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐసర్ లేబర్ కాలనీలో అధికారుల పరిశీలన

ఏర్పేడు: మండలంలోని జంగాలపల్లె ఐసర్ లేబర్ కాలనీలో శనివారం పలువురు అధికారులు పరిశీలించారు. ఐసర్‌లో భవన నిర్మాణ కార్మికులు తాత్కాలిక షెడ్‌లు వేసుకుని నివాసం ఉంటున్నారు. ఆ ప్రాంతంలో పలువురు కార్మికులు విష జ్వరాలు, విరేచనాలు, వాంతులతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లారు. కొంత మంది తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్నారు. అధికారులు అక్కడికి చేరి పరిశీలించారు. పారిశుధ్యం సమస్యల మూలాన కార్మికులు అనారోగ్యం బారిన పడినట్లు చెప్పారు. కార్యక్రమంలో తిరుపతి లేబర్ కమిషనర్ బాలునాయక్, రమేష్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయ్ కుమార్, డీఈ శంకర్‌రెడ్డి, ఏఈ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వన్నెకుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో ఆదివారం వన్నెకుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ముఖ్యఅతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

ఎండీ పుత్తూరులో ఉచిత కంటి వైద్య శిబిరం

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సర్పంచ్ మోహనప్రియ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి వెన్నెల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు పరీక్షిస్తారని, దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.

కమనీయం చెన్నకేశవుని కల్యాణం



కల్యాణోత్సవంలో అంజూరు, భక్తులు



విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం రాత్రి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శ్రీకాళహస్తి దేవస్థానం అనుబంధ చెన్నకేశవ ఆలయంలో ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆలయ పండితులు ఉత్సవ మూర్తులకు పలురకాల సుగంధ పరిమళాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి విగ్రహాలను కొలువుదీర్చి, మొదట గణపతి పూజ, నవగ్రహ శాంతి హోమం, కంకణ పూజ, మాంగల్యపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయాధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. మళ్లీ పంట నష్టం



బుచ్చినాయుడుకండ్రిగలో కురుస్తున్న వర్షం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శనివారం సాయంత్రం ఉరుములు. మెరుపులతో కురిసిన అకాల వర్షానికి మళ్లీ మామిడి, మిరప రైతులు నష్టపోయారు. మండలంలో రైతుల చేతికి అందివచ్చిన 150 ఎకరాల్లోని మామిడితోటల్లో కాయలు నేలరాలడంతోపాటు 50 ఎకరాల్లోని మిరపపంట దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మిరపకాయలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. అయితే చెరకు, వరి రైతులకు మాత్రం వర్షం సంతోషాన్నిచ్చింది.

సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలలు

- టెన్త్ ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత

రేణిగుంట: టెన్త్ ఫలితాల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరచారు. నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి పట్టణంలో 915 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 654 మంది ఉత్తీర్ణులై 71శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే శ్రీకాళహస్తి మండలంలో మొత్తం 357మంది విద్యార్థులకు గాను 250మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే రేణిగుంట మండలంలో మొత్తం 11 హైస్కూళ్లలో 536మంది పరీక్ష రాయగా, వారిలో 296మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 55.22శాతం ఉత్తీర్ణతను సాధించారు. రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు మంచి మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నారు. ఇక, ఏర్పేడు మండలంలో మొత్తం 659 మందికి గాను 498 పాసై 76శాతం ఉత్తీర్ణతను సాధించారు. మండలంలోని బండారు పల్లె హైస్కూల్ విద్యార్థులు విశేషంగా రాణించారు. తొట్టంబేడు మండలంలో మొత్తం 303 మంది పరీక్ష రాయగా, వారిలో 195మంది ఉత్తీర్ణులై 64శాతం ఉత్తీర్ణత సాధించారు. నియోజకవర్గంలోని పలు స్కూళ్ల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి ఎంఈఓలు, టీచర్లు, గ్రామస్తుల నుంచి అభినందనలు అందుకున్నారు.

సత్యవేడు నియోజకవర్గంలో..

వరదయ్యపాళెం: ప్రభుత్వం విడుదల చేసిన పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. విద్యా విధానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విధానాలు ఫలితాలకు ఊతమిచ్చినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 39 ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 2,290 మంది పది పరీక్షలకు హాజరు కాగా 1,469 మంది ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. సత్యవేడు మండలంలో 70శాతం, వరదయ్యపాళెం మండలంలో 57.88శాతం, బీఎన్‌కండ్రిగ మండలంలో 52శాతం, నాగలాపురం మండలంలో 52.17శాతం, పిచ్చాటూరు మండలంలో 67.27శాతం, నారాయణవనం మండలంలో 74.4శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే పలు స్కూళ్ల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి స్కూళ్ల పేరు ప్రతిష్టలు నిలబెట్టారు. విద్యాశాఖ అధికారులు, టీచర్లు, గ్రామస్తుల నుంచి అభినందనలు అందుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్టుమెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 59,849 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,097 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో భక్తులు హుండీలో రూ.2.72 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 10 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

స్కూటరిస్ట్ మృతి

ఏర్పేడు: మండలంలోని కొత్తకండ్రిగ సమీపంలో ఉన్న పుష్పిత్ కర్మాగారం వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్ మృతిచెందినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి పుష్పత్ కర్మాగారం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. మృతుని వయసు ఇంచుమించు 45 ఏళ్లు ఉండొచ్చని 108 వాహన సిబ్బంది తెలిపారు.

స్మార్ట్ సిటీ పనులు వేగవంతం

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ సిటీ పనులను వేగవంతం చేయాలని స్మార్ట్ సిటీ ఎండీ డి.హరిత ఇంజినీర్లను ఆదేశించారు. ఆమె శనివారం స్మార్ట్ సిటీ ప్రాజెక్టులపై అధికారులతో సమీక్షించారు. శ్రీనివాస సేతు, అండర్ విద్యుత్ కేబుల్, వినాయకసాగర్, షాపింగ్ కాంప్లెక్స్ తదితరాలపై కాంట్రాక్టర్లతో మాట్లాడారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. అలానే పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణం గురించి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన గడువులోపు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈఈలు దేవిక, సంజయ్‌కుమార్, మహేష్, గోమతి, మోహన్, ఏవో రాజశేఖర్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న స్మార్ట్ సిటీ ఎండీ హరిత

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



అంబూరు గిరిజనకాలనీలో లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్లను ఇస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: నిత్యం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని మావిళ్లపాడు, అంబూరు గ్రామ పంచాయతీల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. అర్హత ఉన్ననూ సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందకపోతే వారికి లబ్ధి చేకూర్చాలని అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

మావిళ్లపాడు తూర్పు హరిజనవాడలో పలువురు ఇంటి స్థలాల కోసం ఎమ్మెల్యేను కోరారు. ప్రభుత్వ భూమిని గుర్తించి స్థలాలు పంపిణీ చేయాలని తహసీల్దార్ గౌరిశంకరరావును ఆదేశించారు. అంబూరు దళితవాడలో నూతన ఇళ్ల మంజూరు కోసం విన్నవించగా రెండో విడతలో మంజూరు చేయాలని హౌసింగ్ ఏఈకి సూచించారు. అలాగే స్థానికంగా పలు వీధులకు సీసీ రోడ్లు మంజూరు చేయాలని కోరారు. స్థానికంగా నెలకొన్న దారి సమస్యను సైతం ఎమ్మెల్యే అక్కడికక్కడే స్పందించారు. చెట్లపొదలను తొలగించి దారి సౌకర్యాన్ని పునరుద్ధరించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, సర్పంచులు సాయిరెడ్డి, నీరజమ్మ, మాజీ సర్పంచ్ బొప్పన తిలక్‌బాబు, వెంకటప్ప నాయుడు, మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రమణ్యం రెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ శివాయాదవ్, సర్పంచులు దుడ్డు వేణు, రమణయ్య, వీరభద్రం, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, ఎంఈఓ సరస్వతి, సీడీపీఓ దేవా కుమారి, ఏపీఎం తిరుమల రాజు, ఎస్ఐ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎంపీ బీద మస్తాన్‌రావు

బీఎన్‌కండ్రిగ మండలం పల్లమాలలోని శ్రీ కోదండ రామాలయం వద్ద నూతనంగా నిర్మించ తలపెట్టిన కళ్యాణ మండపానికి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు రూ. 25లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వరదయ్యపాళెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండ్రోజుల క్రితం కోదండరామాలయం సందర్శనకు వచ్చిన బీద మస్తాన్‌రావు పల్లమాల గ్రామస్తుల వినతిపై స్పందించి నిధులు మంజూరు చేస్తున్నట్లు సెల్‌ఫోన్ ద్వారా సమాచారమిచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కోరిన వెంటనే స్పందించిన ఆయనకు మండల ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: మండలంలోని పవనివారి కండ్రిగ, మర్రిగుంట గ్రామాల్లో ఇటీవల ప్రమాదాలకు గురై మృతి చెందిన వలంటీర్ ఉదయ్‌భాస్కర్, గృహ సారథి సురేష్ కుటుంబాలను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం ద్వారా రూ.10 వేలు తక్షణ సాయం అందజేశారు. అలాగే తాను సొంతంగా మరికొంత సొమ్మును ఇచ్చారు. రెండు కుటుంబాల్లో అర్హత ఉన్న వారిని వలంటీర్లుగా నియమించాలని ఎంపీడీఓ రామచంద్రను ఆదేశించారు. వారి పిల్లలకు ఆదర్శ పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో చేర్పించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తొలుత మృతుల చిత్రపటాలకు ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ ముఖ్యనేతలు నందకుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బొర్రా మాధవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ హరిబాబు, ఢిల్లీ, బొబ్బిలి నాగరాజు పాల్గొన్నారు.

సింహ వాహనంపై వేదనారాయణుని కటాక్షం





సింహ వాహనంపై విహరిస్తున్న వేదనారాయణ స్వామి, ముత్యపు పందిరి వాహన సేవలో..

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు సింహ వాహనంపై వేదనారాయణుడు తిరువీధుల్లో మేళతాళాలు, మంగళ వాయిద్యాల హోరు నడుమ విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తర్వాత 10 గంటలకు ఉత్సవమూర్తులకు ఆలయ మండపంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ పంచతీర్థాలతో కూడిన సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని రాములవారి మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణుని విశేషంగా అలంకరించారు. ముత్యపుపందిరి వాహనంపై ఆశీనులు చేసి కర్పూర నీరాజనాలు, నైవేద్యం సమర్పించారు. రాత్రి నిజాలయానికి స్వామివారు చేరి ఏకాంతసేవలో పవళించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను టీటీడీ ఏఈఓ మోహన్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షించారు.

నేడు కల్పవృక్ష, సర్వభూపాల వాహన సేవ

ఆదివారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ, రాత్రి సర్వభూపాల వాహన సేవ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పారిశుధ్యం మెరుగు పరచండి



అధికారులతో మాట్లాడుతున్న శ్రీహరి

ఏర్పేడు: పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి శ్రీహరి ఆదేశించారు. శనివారం మండలంలోని జంగాలపల్లె వద్ద ఉన్న ఐసర్‌లో పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. పలువురు భవన నిర్మాణ కార్మికులకు రక్తపోటు, షుగర్, రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఐసర్‌లో పారిశుధ్యం సమస్యలు తాండవిస్తున్నాయని, దీనిమూలాన కార్మికులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి, జిల్లా మలేరియా అధికారి రూప్‌కుమార్, ఏర్పేడు పీహెచ్‌సీ డాక్టర్ రాఘవరెడ్డి, సీహెచ్‌ఓ శివరాజు పాల్గొన్నారు.

మణిపూర్‌లో తెలుగు వారి కోసం హెల్ప్‌లైన్

తిరుపతి అర్బన్: మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లు జరుగుతున్న నేపథ్యంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలుగు వారిని రక్షించడానికి న్యూఢిల్లీలోని ఏపీ భవనంలో హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేశారని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్కడ మన రాష్ట్రం విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే తల్లిదండ్రులు వారికి ఈ హెల్ప్‌లైన్ నంబర్లు తెలియజేస్తే రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. హెల్ప్‌లైన్ నంబర్లు 011-23384016, 011-23387089 సద్వినియోగం చేసుకోవాలని కోరారు.